దావీదు ఒక కుటిలమైన ప్రణాళిక ద్వారా ఊరియాను రప్పించి అతని భార్యయైన బత్షెబ యొద్ద పరుండుటకు అతని ఇంటికి పంపాడు. ఆ విధముగా చేయుట ద్వారా బత్షెబకు జన్మించబోయే బిడ్డకు, ఆమె భర్తయగు ఊరియాయే తండ్రి అని ప్రజలు భావిస్తారని దావీదు తలంచెను. అయితే ఊరియా తన ఇంటికి వెళ్ళుటకు తిరస్కరించెను. ఆ విషయమై ఊరియా రాజైన దావీదుకు ఇచ్చిన జవాబు కొరకు 2 సమూ 11:11 చదువుడి. దావీదు యుక్తితో చేయలేని కార్యమును తన అధికారమును ఉపయోగించి ఊరియాను చంపించెను.

**సోమవారం** **జూలై 19**

## నాతాను మరియు ఒక దృష్టాంతము (2సమూ. 12:1-4)

మొదటగా దావీదు తనకు ఎంతో నమ్మకస్తుడైన ఒక సైనికుని భార్యతో శయనించాడు. తరువాత తన పాపమును దాచి పెట్టుటకు ప్రయత్నించాడు. ఊరియా అనే ఆ సైనికుని యుద్ధములో గాయపర్చి చనిపోయే విధముగా అతనిని ఒక ప్రమాదకరమైన చోటకు పంపి చంపి వేయమని దావీదు రాజు యోవాబునకు చెప్పెను. ఆ నింద దావీదు మీదకు రాకుండా ఊరియాను చంపేసారు. దావీదు జీవితములో ఎదుర్కొనిన ఘోరమైన సమయములలో ఇదొకటి. ఇక్కడొక శుభవార్త ఉంది. దేవుడు దావీదు వద్దకు నాతాను ప్రవక్తను పంపెను. ప్రవక్త దేవుని యొద్ద నుండి ప్రత్యేక వర్తమానమును తీసుకొని వచ్చేవాడు. నాతాను మరియు దావీదు స్నేహితులు. దేవునికి ఒక దేవాలయమును నిర్మించే విషయములో దావీదుకు నాతాను సలహా ఇచ్చాడు (2సమూ 7). ఇపుడు దోషిగా మారిన రాజుకు వేరే విధమైన పనిని చేయుటకు దేవుడు నాతానును నియమించెను.

**ఒక దృష్టాంతమును చెప్పాలని నాతాను ఎందుకు నిర్ణయించుకున్నాడని నీవనుకుంటున్నావు? దావీదు చేసిన పాపమును గూర్చి ఆయనను సిగ్గు పరచలేక నిందించక పోవడానికి కారణమేమై యుంటుందని నీవనుకొనుచున్నావు? (2సమూ 12:1-14 చదువుడి).**

ఏమి మాట్లాడాలో నాతానుకు తెలుసు. కాని దావీదు అర్ధము చేసుకొనే విధముగా అతడు చెప్పాడు. రాజుగా దావీదు నియమింపబడక పూర్వము అతడొక గొర్రెల కాపరి. అందుచేత నాతాను గొర్రెలను గూర్చి చెప్పాడు. దావీదు నీతి న్యాయములు జరిపించుటకు ఇష్టపడే వ్యక్తి అని నాతానుకు తెలుసు. దావీదు తాను చేసిన నేరమునకు తానే మరణ శిక్షను వేసుకొనే విధముగా నాతాను ఒక పథకము ప్రకారము మాట్లాడగా దావీదు ఆ బోనులోనికి నడిచి వెళ్ళాడు.

దావీదు తనకు తానే తీర్పు చెప్పుకున్నపుడు నాతాను ఆయనను చూసి "ఆ మనుష్యుడవు నీవే" అని చెప్పెను (2 సమూ 12:7). దావీదుతో ఆ విషయాలన్ని నాతాను కేకలు వేసి చెప్పవచ్చును. నాతాను తన వ్రేలిని దావీదు ముఖముపై పెట్టి నిందించవచ్చును. లేక ప్రేమతో చెప్పవచ్చును. పాపుల యెడల దేవుడు తన ప్రేమను మరియు కృపను ఏవిధముగా చూపిస్తాడో నాతాను కూడా దావీదు యెడల ఆ మార్గమునే ఎంచుకున్నాడు. దేవునికి విరోధముగా తన బిడ్డలు పాపము చేసినపుడు ఆయన ఏవిధంగా చింతిస్తాడో దావీదు కూడా అటువంటి బాధను అనుభవించాలని నాతాను యొక్క ఉద్దేశమై యున్నది. నాతాను యొక్క మాటలు దావీదు హృదయమును తాకినవి. తాను చేసిన పాపము ఎంత ఘోరమైనదో దావీదు చూడగలిగాడు.

**దావీదు "నేను యెహోవాకు వ్యతిరేకముగా పాపము చేసితిని? అని ఎందుకు చెప్పెను. బత్షెబకు వ్యతిరేకముగా పాపము చేసితినని ఎందుకు చెప్పలేదు? నేనొక నరహంతకుడిని అని ఎందుకు చెప్పలేదు? 2సమూ 12:13 మరియు కీర్తన 51:4 చదువుడి.**

పాపము దేవునిని గాయపరుస్తుందని దావీదు చూసాడు. పాపము చేసినపుడు మనలను మనము గాయపర్చుకుంటున్నాము. మన పాపము ఇతరులను కూడా గాయపరుస్తుంది. మన కుటుంబస్తులను లేక సంఘములను సిగ్గుపరుస్తున్నాము. మన పాపాలు దేవునిని సిలువ మీద మరొకసారి మేకులు కొట్టుచున్నవి.

మంగళవారం జూలై 20

## క్షమించు మరియు మరచిపో? (2సమూ 12:10-23)

దావీదు తన సొంత శిక్షను ప్రకటించుకున్నాడు (2సమూ 12:5,6) చాలా పెద్ద పాపము చేశావని దావీదుకు నాతాను చెప్పాడు. దానిపర్యవసానముగా భవిష్యత్తులో కొన్ని చెడు సంఘటనలు సంభవిస్తాయని కూడా నాతాను చెప్పాడు (2సమూ 12:10-12). విచారముతో దావీదు యొక్క హృదయము పగిలినది. దావీదు తన పాపమును ఒప్పుకుంటాడు. వెంటనే నాతాను "నీవు చావకుందునట్లు యెహోవా నీ పాపమును పరిహరించెను" అని చెప్పెను. (2సమూ 12:13) దేవుడు దావీదును క్షమిస్తాడని అతడు ఎదురు చూడవలసిన అవసరము అతనికి లేదని నీకు కనిపిస్తున్నదా? దేవుడు దావీదును క్షమించకముందే అతడు క్షమింపబడుటకు సిద్ధముగా ఉన్నట్లు దావీదు నిరూపించుటలేదు.

తరువాత నాతాను మరి కొంత చెడు వార్తను దావీదుకు చెప్పాడు. దావీదు మరియు బత్షెబకు పుట్టబోవు బిడ్డ జన్మించినవెంటనే చనిపోవును అని చెప్పెను.

**దావీదు చేసిన పాపమును దేవుడు క్షమించి దానిని తొలగిస్తాను అని చెప్పుటలో దాని**

**భావమేమిటి? గతమును దేవుడు మార్చివేయునా? ప్రతి ఒక్కరు గతములో జరిగిన వాటన్నిటిని మర్చిపోదురా? ఈ ప్రశ్నలను గూర్చి ఆలోచించునపుడు 2 సమూ 12:10-23 చదువుడి.**

తన జీవితమునకు పతనము ఆరంభమైనట్లు దావీదు భావించాడు. పుట్టిన బిడ్డ మరణించుట, తన కుమారులతో భవిష్యత్తులో ఎదురయ్యే కుటుంబ సమస్యలు, వీటిని తలంచుకొని కొంత ఆందోళన చెందాడు. అయితే దేవుడు తన పాపమును క్షమిస్తాడని కూడా దావీదు గ్రహించాడు. వారు చేసిన పొరపాట్లను దేవుని యొక్క కృప కప్పిపుచ్చును. ఏదో ఒక దినమున జరిగిన సంఘటనలు సరిచేయబడును. బాధపడుచున్న వారిని దేవుడు స్వస్థపర్చును. అందుచే దావీదు ఇపుడు దేవుని యొక్క కృపలో విశ్రాంతిని కనుగొనగలడు.

**నిజముగా ఇప్పుడు దావీదుకు అవసరమైన దేమిటి? అన్నిటికి మించి, దేని కొరకు దావీదు ఆశపడుచున్నాడు? (కీర్తన 51:1-6 చదువుడి).**

కీర్తన 51లో దావీదు ఒక బహిరంగ ప్రకటన చేస్తున్నాడు. తన హృదయమును తెరచి తన పాపాలను ఒప్పుకొనెను. దేవుని కృప కొరకు దుఃఖించాడు. ఎన్నడూ మోసము చేయని దేవుని యొక్క ప్రేమను తన యెడల చూపమని అడిగాడు. శుద్ధ హృదయమును, నూతన ఆత్మను తనకు అనుగ్రహించమని దేవుని కోరుచున్నాడు.

యేసునందు కోరుకునే విశ్రాంతిని పొందుటకు చెల్లించవలసిన మూల్యమును అర్థము చేసుకొనుటకు ఈ కీర్తన మనకు సహాయపడును. పాపులమైన మనకు సహాయమవసరమనియు, రక్షకుడు అవసరమనియు, ముందుగా గ్రహించాలి. దావీదు 10 ఆజ్ఞలలో 5 ఆజ్ఞలు మీరాడు. సహాయము కొరకు, క్షమాపణ కొరకు దేవుని అడిగాడు. దావీదువలె మనము కూడా అడుగవచ్చును.

**బుధవారం** **జూలై 21**

## ఒక నూతనమైనది (కీర్తన 51:7-12)

దావీదు తన పాపమును ఒప్పుకొనుచున్నాడు. తన ప్రవర్తనను సమర్థించుకుంటూ లేక తన పాపము అంత చెడ్డదేమీ కాదని ఎటువంటి సాకులు చెప్పుటలేదు. అటు తరువాత దేవునిని దేని కొరకో అడుగుచున్నాడు. దేని కొరకు దావీదు అడిగాడు? (కీర్తన 51:7-12 చదువుడి).

హిస్సోపుతో తనను శుద్ధి చేయమని దావీదు అడుగుచున్నాడు. (కీర్తన 51:7) హిస్సోపు పుదీనా కుటుంబమునకు చెందిన ఒక చిన్న చెట్టు. ప్రతి ఇశ్రాయేలుకు బైబిలు కాలములో హిస్సోపును గూర్చి తెలుసు. ఒక వ్యక్తి పవిత్రునిగా చేయుటకు మోషే ధర్మశాస్త్రములో హిస్సోపును ఉపయోగించేవారు (లేవి 14:4). దావీదు హిస్సోపును గురించి మాట్లాడుచున్నాడంటే తనకు ఒక ప్రత్యామ్నాయము అవసరముందని అది తెలియజేస్తుంది.

దావీదు యొక్క పాపములకు వచ్చే శిక్షను ఆ ప్రత్యామ్నాయము అంగీకరిస్తుంది. భవిష్యత్తులో రక్షకుడు రాబోవుచున్నాడు. మరియు భూమి మీద ఎందరైతే ఆయనను అంగీకరిస్తారో వారి పాపములను ఆయన పరిహరించును.

తరువాత దావీదు సంతోషమును ఇవ్వమని దేవుని అడిగాడు. ఆమోదయోగ్యము కాని పనులు చేసిన తరువాత ఆనందమును ఇవ్వమని దావీదు అడుగుటను బట్టి చూస్తే మీకు ఆశ్చర్యము కలుగుతుందా? ఎందుకు ఆ విధంగా అడిగాడో అర్ధము చేసుకొనుటకు 13వ వచనము మనకు సహాయపడుతుంది. అప్పుడు అతిక్రమము చేయు వారికి నీ త్రోవలను బోధించెదను. పాపులును నీతట్టు తిరుగుదురు. (కీర్తన 51:13)

దావీదు పాపాలను చేసి వాటిని ఒప్పుకున్న తరువాత నీ సన్నిధిలో నుండి నన్ను త్రోసివేయకుము. నీ పరిశుద్ధాత్మను నా యొద్ద నుండి తీసివేయకుము (కీర్తన 51:11) అని ప్రార్ధించాడు. దావీదు ఈ ప్రార్ధన ఎందుకు చేసాడనుకుంటున్నారు? 12వ వాక్యము చదవండి.

తన హృదయములో దేవుని గూర్చిన తలంపును పోగొట్టుకొనుటకు దావీదుకు ఇష్టము లేదు. పరిశుద్ధాత్మ లేకుండా అతడు బలహీనుడని దావీదు కనుగొన్నాడు. మానవ హృదయము ఎంత సులభంగా పాపములో పడగలదో దావీదు తెలుసుకున్నాడు. తనలో తనకున్న నమ్మకము విరిగిపోయినది.

భవిష్యత్తులో పాపము మీద తనకు కలిగే విజయము తన యొద్ద నుండి రాదని దావీదు గ్రహించాడు. దేవుని నుండే విజయము వస్తుంది. అందుచేత ఇపుడు సంపూర్ణముగా దావీదు దేవుని మీద ఆధారపడవలసి యుందని తెలుసుకున్నాడు. అటులనే మనము కూడా ఈ బైబిలు సత్యమును అర్ధము చేసుకున్నపుడు మన హృదయాలలో యేసు జీవించాలనే ఒక గాఢమైన కోరిక మనలో కలుగుతుంది. అప్పుడు మనము యేసునందు విశ్రాంతిని పొందగలము.

**పాపము నుండి విడుదల పొందియున్నావనే ఆనందమును గూర్చి నీకు తెలుసా? లేనిచో దావీదు యొక్క వృత్తాంతము నీకెట్లు సహాయపడుతుంది?**

గురువారం జూలై 22

## వెలుగు కిరణాలు (కీర్తన 51:13-19)

మనము పొరపాట్లు చేసిన తరువాత మరియు క్షమించబడిన తరువాత మనలో అనేక మంది ఏమి చేస్తారు? ఆ పొరపాటు ఎన్నడూ జరగనట్లుగానే మరచిపోవాలనుకుంటాము. అవునా? మనము చేసిన పొరపాట్లు దుఃఖమును కలిగించవచ్చును. ఆలోచించండి.

**బాధాకరమైన అనుభవముతో దావీదు ఏమి చేయాలనుకుంటున్నాడు? కీర్తన 51:13-19 చదువుడి.**

ఒక గిన్నె లేక కూజా పగిలిపోయినపుడు ఆ ముక్కలను బయట పారవేస్తాము. అయితే జపాను దేశములో పగిలిన మట్టి కుండలను, కూజాలను నేర్పుగా అతికించే వారుంటారు. ఆ పనికి "కింట్సుగి" అనే ప్రత్యేకమైన పేరున్నది. "కింట్సుగి" పనిచేసే కళాకారుడు పగిలిన ముక్కలను తిరిగి అతికించుటకు బంగారమును లేక వెండిని ఉపయోగించి, పగిలిపోయిన కుండను అందమైన కళాత్మక వస్తువుగా తయారు చేస్తారు.

మనతో కూడా దేవుడు అట్టి పనినే చేస్తాడు. దేవుడు మన పాపాలను క్షమించి తిరిగి మనలను నూతన పరచును. పగిలిన జీవితాలను తిరిగి పూర్వపు మనిషిగా మార్చుటకు దేవుని యొక్క క్షమాపణ అతికిస్తుంది. మన జీవితాలలో ఒకప్పుడు ఎక్కడెక్కడ పగిలిపోయామో అక్కడ దేవునికున్న ప్రేమను ఇతరులకు చూపును. అక్కడ దేవుని కొరకు సజీవమైన వెలుగు స్తంభాలమవుదుము. ఆనందముతో కోలాహలం చేస్తాము. దావీదుతో కలసి "దేవా నా నాలుక నీ నీతిని గూర్చి ఉత్సాహ గానము చేయును" (కీర్త 51:14) అని దేవుని స్తుతిస్తాము. మనలను మనమే బాగుచేసుకొనుటకు ప్రయత్నించము. మన హృదయాలలో గర్వము లేకుండా ఖాళీగా ఉంచుతాము. ఆ ఖాళీ హృదయాలను దేవుడు స్తుతియాగముతో నింపుతాడు. అప్పుడు మన హృదయాలు ప్రకాశమానమైన వెలుగు కిరణాలను పోలి ఉంటాయి. మనము క్షమింపబడిన వారమై యున్నామనే అనుభవము ఇతరులను దేవుని యొక్క క్షమాపణ పొందుటకు నడిపిస్తుంది.

**కీర్తన 51 మరియు 1 యోహాను 1:9కి మధ్య ఉన్న సంబంధమేమిటి?**

1 యోహాను 1:9 మరియు కీర్త 51 ఒకే వర్తమానమును బోధిస్తున్నాయి. పాపమును గూర్చి విచారమును వ్యక్తపర్చిన విరిగిన హృదయమును దేవుడు సంతోషముగా అంగీకరిస్తాడని దావీదుకు తెలుసు (కీర్త 51:17). "మన పాపములను ఒప్పుకొనినచో ఆయన నమ్మదగిన వాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1యోహా 1:9).

**1యోహా 1:9లో ఉన్న వాగ్దానమును ఇప్పుడే నీ జీవితములో ఒక భాగముగా ఏవిధముగా చేసుకొనగలవు?**

**శుక్రవారం** **జూలై 23**

## అదనపు అధ్యయనము

"దావీదు తాను చేసిన పాపము విషయమై పశ్చాత్తాపము చెంది దాని నుండి

తొలగిపోయెను. ఆయన నిజముగానే చింతించియున్నాడు. తాను చేసిన పాపమును తక్కువ చేసి చూపించే ప్రయత్నము చేయలేదు. దావీదు క్షమాపణ కొరకు ప్రార్ధించెను. ఆయన చేసిన ప్రార్ధనలు శిక్షకు భయపడి చేసినవి కావు. తన హృదయమును మలినపర్చినవి కావున పాపమును ద్వేషించెను. క్షమాపణ కొరకు మాత్రమే కాక నిర్మలమైన హృదయమును అనుగ్రహించమని ప్రార్ధించెను" (కీర్తన 51:16,17).

దావీదు పాపములో పడిపోయాడు. అయితే దేవుడు అతని పాపములను క్షమించి ఒక నూతన జీవితమును ఇచ్చెను.

తన హృదయమందున్న గర్వమునంతటిని తొలగించుకొని పాపమును ఒప్పుకొనెను. సౌలు ఆ విధముగా చేయక దేవునికి వ్యతిరేకముగా తన హృదయము కఠినపర్చుకొనెను.

మానవ హృదయము ఎటువంటిదో దావీదు చేసిన పాపము చూపించినది. మానవ హృదయము బలహీనమైనది. తప్పుచేయాలనే కోరిక బలముగా ఉంటుంది. అందుచే మన పాపాలు ఒప్పుకొని పరిశుద్ధాత్మ సహాయముతో పాపము నుండి తొలగవలెను" –ఎలెన్ జి వైట్, పితరులు మరియు ప్రవక్తలు, పుటలు 725, 726.

## చర్చించుకొనుటకు ప్రశ్నలు

1. పరలోకపు రాజు యొక్క క్షమింపబడిన కుమారులము మరియు కుమార్తెలమని విశ్వాసము ద్వారా అంగీకరించవలసియున్నాము. పాపక్షమాపణ అవసరమైన పాపులమని తెలిసి నిరీక్షణతో ఎట్లు జీవించగలము?
2. ప్రతి విధమైన పాపము ఎందువలన దేవునికి వ్యతిరేకము? ఆయనకు వ్యతిరేకముగా పాపము చేయుట అనగా అర్ధమేమిటి?
3. శ్రమలను దేవుడు ఎందుకు అనుమతిస్తాడు? లోక వ్యాప్తముగా దేవునికిని మరియు సాతానుకు మధ్య జరుగుచున్న యుద్దము ఈ ప్రశ్నకు ఏవిధముగా జవాబిచ్చుటకు సహాయపడుతుంది?
4. బైబిలులో దావీదు మరియు బత్షెబలు యొక్క వృత్తాంతము ఎందుకు చెప్పబడెనని నీవనుకొనుచున్నావు?
5. కీర్త 51:11, 12 పాపము మనలను, దేవునిని వేరు చేస్తుంది అని చూపిస్తున్నాయి. ఇది ఎలా సాధ్యమని నీవనుకొనుచున్నావు?

★★★